

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 03-11-2024 | సంపుటి - 21 | సంచిక -196 | రూ : 4 | పేజీలు: 8


# ఎగిరిపోదాం విదేశాలకు..

- రోజురోజుకూ పెరుగుతున్న అధిక సంపాదన మోజు
- అగ్ర దేశాల వీసాల కోసం లక్షలాది మంది నిరీక్షణ
- వీసా వస్తే లాటరీ తగిలినట్టేనని భారతీయుల సంబరం

న్యూఢిల్లీ, నవంబర్ 2: ఉన్నత చదువు, ఉద్యోగం, ఉపాధి పేరుతో మన దేశం నుంచి ఏటా లక్షలాది మంది విదేశాలకు ఎగిరిపోతున్నారు. ఒకసారి విదేశాలకు వెళ్లిన వారు తిరిగి భారత్‌కు రావడం ఇంచుమించు జరగడం లేదు. ప్రపంచంలో అతి పెద్ద విదేశీ వీసా భాగస్వాములుగా భారతీయులు నిలుస్తున్నారు. విద్యార్థులు, వృత్తి నిపుణులు అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ వీసాల కోసం క్యూలు కడుతున్నారు. అధిక సంపాదన కలను నెరవేర్చుకోవడమే తమ జీవిత లక్ష్యంగా చాలామంది ఉన్నారు. విదేశాల్లోని మంచి కాలేజీలు, యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తే కెరీర్ అవకాశాలు మెండుగా ఉంటాయన్న ఆశతో పెద్దయెత్తున ప్రతి ఏడాది విద్యార్థులు విదేశాలకు క్యూ కడుతున్నారు. దీనికి లక్షల రూపాయలు ఖర్చవుతున్నా తల్లిదండ్రులు కూడా వెనుకడుగు వేయడం లేదు. వీసా వస్తే చాలు లాటరీ కొట్టినంతగా సంబర పడిపోతున్నారు. ఈ ఏడాది మన దేశం నుంచి సుమారు 18 లక్షల మంది విద్యార్థులు విదేశాల్లో

తరువాయి 2లో






## శబరిమల అయ్యప్ప భక్తులకు ఉచిత బీమా

- ఈ ఏడాది వరకు మాత్రమే

కొట్టాయం: శబరిమల అయ్యప్ప స్వామి భక్తులకు ఉచిత బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు కేరళ దేవాదాయ శాఖ మంత్రి వీఎన్ వాసవన్ శనివారం చెప్పారు. ఈ నెలాఖరు నుంచి ప్రారంభమయ్యే మండలంమకరవిళక్కు సీజన్‌లో శబరిమలను సందర్శించే భక్తులకు రూ.5 లక్షల ఉచిత బీమా సదుపాయం వర్తిస్తుందన్నారు. ఈ దేవాలయం నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించే ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు ఈ ఏడాది శబరిమలకు వచ్చే భక్తులందరికీ బీమా కవరేజ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## స్వయంగా టీ కాచి.. మంత్రులకు అందజేసిన సీఎం చంద్రబాబు



# టాస్ ఏర్పాటు చేయండి

- సర్కార్కు గ్రూప్ 1 అధికారుల వినతి
- 2015లో టాస్పై స్టడీకి ఐఏఎస్లతో కమిటీ ఏర్పాటు
- ఇప్పటి వరకు నివేదిక ఇవ్వని ప్యానెల్
- రాష్ట్రంలో తీవ్ర ఐఏఎస్ల కొరత
- 210 మంది ఉండాల్సింది.. 160 మందే ఉన్నరు


హైదరాబాద్: తెలంగాణ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (టాస్) ఏర్పాటు చేయాలని గ్రూప్ 1 అధికారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రాష్ట్రంలో ఐఏఎస్ ల

తరువాయి 2లో



## ఎస్సీ గురుకులాల్లో ఏఐ కోర్సులు

- పైలట్ ప్రాజెక్టుగా శంకర్ పల్లి స్కూల్



హైదరాబాద్ : ఎస్సీ గురుకులాల్లో చదువుతున్న స్టూడెంట్స్ కు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మిషన్ లెర్నింగ్ ( ఎంఎల్ ) కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ అకడమిక్ ఇయర్లో పైలట్ ప్రాజెక్టుగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి ఎస్సీ గురుకుల స్కూల్ ను ఎంపిక చేసి, క్లాసులు నిర్వహిస్తున్నారు. ర్యాస్ప బెర్రి పీఐ ఇంటర్నేషనల్ సంస్థ, నిర్మాణ్ ఎన్జీవో, హైదరాబాద్ సాఫ్ట్ వేర్ ఎంటర్ ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) లు సీఎస్ఆర్ కింద వీటి నిర్వహణకు ముందుకు వచ్చినట్టు ఎస్సీ గురుకుల సెక్రటరీ అలుగు వర్షిణి శనివారం ఓ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

## కేసీఆర్ కలల ప్లాంట్ రెడీ..



- వెలుగులు పంచేందుకు సిద్ధమైన 'యాదాద్రి'
- సిద్ధమైన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్
- నేడు బొగ్గు బోగీని ప్రారంభించనున్న మంత్రులు

దామరచర్ల, నవంబర్ 2 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికతతో తలపెట్టిన బృహత్తరమైన ప్రాజెక్టు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వెలుగులు పంచేందుకు సిద్ధమైంది. కేసీఆర్ పాలనలోనే 90 శాతం పనులు పూర్తి చేసుకున్న ప్లాంట్‌ను నేడు మంత్రులు ప్రారంభించనున్నారు. దక్షిణాదిలో అతిపెద్దదైన నల్లగొండ జిల్లాలోని యాదాద్రి పవర్ ప్లాంట్ మొదటి, రెండో యూనిట్ల నుంచి పూర్తిస్థాయిలో కాంతులు విరజిమ్మనుంది. ప్లాంటుకు అనుసంధానంగా రైల్వేలైన్లు పూర్తికావడంతో రామగుండం నుంచి బొగ్గు వ్యాగన్‌తో పాటు మొదటి యూనిట్ సింక్రనైజేషన్‌ను మంత్రులు

తరువాయి 2లో

# మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి సీఎం

- స్టార్క్యాంపెయినర్ హోదాలో పర్యటన
- ఈ నెల 8 నుంచి 18 లోపు ప్రచారానికి సన్నాహాలు
- జార్ఖండ్ రాష్ట్ర ఎలక్షన్ ఇన్చార్జిగా భట్టి బిజీ

హైదరాబాద్, మహారాష్ట్రలో ఈ నెల 20న అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండడంతో అక్కడ ప్రచారం ఇప్పుడిప్పుడే ఊపందుకున్నది. తెలంగాణను ఆనుకునే ఈ రాష్ట్రం ఉండడంతో అక్కడ ప్రచారానికి ఇక్కడి నేతలు తరలివెళ్తున్నారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కూడా మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. స్టార్ క్యాంపెయినర్ హోదాలో రేవంత్ ఈ నెల 8 నుంచి 18 లోపు అక్కడ ప్రచారం కొనసాగించే

తరువాయి 2లో



## గుడ్‌న్యూస్.. మొదట స్థలాలు ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇళ్లు



హైదరాబాద్: స్థలం ఉండి ఇళ్లులు లేని పేదలకు మొదటి దశలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రెండో దశలో స్థలం లేని వారికి స్థలం ఇచ్చి, ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల గుర్తింపు ప్రారంభం అవుతుందన్నారు. లబ్ధిదారుల గుర్తింపు కోసం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించినట్టు చెప్పారు. ఈ నెల 15 నుంచి 20 తేదీల మధ్య గ్రామ సభలు నిర్వహిస్తామని, ఈ సభల్లో అర్హులైన వారిని గుర్తించి లిస్ట్ ఖరారు చేస్తామని స్పష్టం చేశారు. కేంద్రం నిబంధనల ప్రకారం.. 80 గజాలా స్థలాన్ని లబ్ధిదారులకు ఇస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. అందుబాటులో లేని చోట్ల భూమి కొనుగోలు చేసి మరీ కేటాయిస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం

తరువాయి 2లో

## తెలంగాణలో మళ్లీ ఎమర్జెన్సీ రోజులు : కేటీఆర్

- హెచ్ఎండీఏ పరిధిలో జీపీ లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు బంద్ మూర్ఖపు చర్య
- పేద, మధ్య తరగతి ప్రజలను సర్కార్ టార్గెట్ చేసిందని కామెంట్



హైదరాబాద్ : రాష్ట్రంలో మళ్లీ ఎమర్జెన్సీ రోజులొచ్చాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని, హక్కుల కోసం పోరాడితే బెదిరిస్తూ సస్పెన్షన్లు చేస్తున్నారని

తరువాయి 2లో

## ఇంటింటి సర్వేకు సన్నాహాలు...

- 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్
- పర్యవేక్షణకు సూపర్వైజర్ల నియామకం
- మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ

మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర ఇంటింటి సర్వేకు అధికార యంత్రాంగం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తోంది. నిర్దేశిత ప్రోఫార్మా ప్రకారం అన్ని వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల గణన చేపట్టనున్నారు. ఈ మేరకు అవసరమైన సిబ్బంది నియామకం, సర్వే నిర్వహణపై శిక్షణ

తరువాయి 2లో



# మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి సీఎం రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

అవకాశాలు ఉన్నట్టు పీసీసీ వర్గాలు చెప్తున్నాయి. ఇప్పటికే ఏఐసీసీ నుంచి ఆదేశాలు అందడంతో ఆ రాష్ట్రంలో ప్రచారం కోసం సీఎం సన్నాహాలు చేసుకుంటున్నారు. ముఖ్యంగా ముంబైలో తెలుగువారు ఎక్కువగా ఉన్న ప్రాంతాలతోపాటు తెలంగాణను ఆనుకొని ఉన్న జిల్లాల్లో రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్కుమార్ గౌడ్ ప్రచారం చేయనున్నారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. కాగా, మహారాష్ట్రలో కాంగ్రెస్ గెలుపు కోసం ఆ రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేతలతో రాష్ట్రానికి చెందిన మంత్రులు ఉత్తమ్, సీతక్క ఇప్పటికే ముంబైలో సమావేశమై, తగిన వ్యూహాలను రచించారు. ఇదే రాష్ట్రంలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి తమకు కేటాయించిన యావత్మాల్, చంద్రాపూర్ జిల్లాల్లో ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఇక జార్ఖండ్ రాష్ట్ర కాంగ్రెస్ ఎలక్షన్ ఇన్చార్జిగా డిప్యూటీ సీఎం భట్టి.. అక్కడే మకాం వేసి ఆ రాష్ట్ర పార్టీ నేతలకు ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేస్తున్నారు.



# టాస్ ఏర్పాటు చేయండి

(మొదటిపేజీ తరువాయి)

కొరత ఉన్న నేపథ్యంలో టాస్ ఏర్పాటు చేస్తే కొన్ని పోస్టుల్లో గ్రూప్ 1 అధికారులను నియమించే చాన్స్ ఉంటదని గుర్తు చేస్తున్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం 208 ఐఏఎస్ పోస్టులు సాంక్షన్ చేస్తే.. ప్రస్తుతం 160 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్షాను సీఎం రేవంత్ రెడ్డి కలిసిన పలు సందర్భాల్లో ఐఏఎస్ లు కేటాయించాలని కోరుతున్నారు. ఐఏఎస్ల కొరత కారణంగా ఒక్కో అధికారి 3, 4 బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. టాస్ ఏర్పాటు చేస్తే కార్పొరేషన్లతో పాటు మరి కొన్ని డైరెక్టర్ పోస్టుల్లో గ్రూప్ 1 అధికారులను నియమించుకునే వెసులుబాటు ప్రభుత్వానికి ఉంటదని అంటున్నారు.

**ఇతర రాష్ట్రాల్లో సక్సెస్**

కేరళ, హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, గుజరాత్, రాజస్థాన్ లాంటి రాష్ట్రాలు అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ ను ఏర్పాటు చేసుకున్నాయి. అన్ని చోట్ల సక్సెస్ అయ్యాయి. ఆయా రాష్ట్రాల్లో అధ్యయనం చేసేందుకు వెళ్లిన టైమ్లో అక్కడి అధికారులు చెప్పారని తెలంగాణ గ్రూప్ 1 ఆఫీసర్లు చెప్తున్నారు. అన్ని శాఖల్లోని పోస్టులను అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ లోకి తీసుకొచ్చి అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అధికారులకు మాత్రమే ఐఏఎస్ పదోన్నతులు కల్పిస్తున్నారు. దీంతో అన్ని శాఖల్లో ఉన్న గ్రూప్ 1 అధికారులకు న్యాయం దక్కుతున్నది.

**2015లో కమిటీ ఏర్పాటు**

టాస్ ఏర్పాటు చేయాలని గత 10 ఏండ్ల నుంచి గ్రూప్ 1 అధికారులు కోరుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి అధికారులు విన్నవించగా.. మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ చైర్మన్ గా పంచాయతీరాజ్, జీఏడీ, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీలతో పాటు మరో ఇద్దరు ఐఏఎస్ లతో 2015, మార్చిలో అప్పటి సీఎస్ రాజీవ్ శర్మ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు జీవో 777ను జారీ చేశారు.

టాస్ ఏర్పాటు ఆవశ్యకత, ఇతర రాష్ట్రాల్లో స్టేట్ సర్వీస్ ఉందా? అనే అంశాలపై అధ్యయనం చేసి రిపోర్ట్ ఇవ్వాలని కమిటీని ఆదేశించారు. ఇప్పటి దాకా ఆ కమిటీ రిపోర్ట్ ఇవ్వలేదని గ్రూప్ 1 అధికారులు చెప్తున్నారు. తెలంగాణ గ్రూప్ 1 ఆఫీసర్స్ అసోసియేషన్ తరఫున గ్రూప్ 1 అధికారులు కూడా కేరళ, హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, రాజస్థాన్, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో పర్యటించారు. ఆయా రాష్ట్రాల్లోని అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ సేవలపై అధ్యయనం చేసి ఐఏఎస్ అధికారుల కమిటీకి 2016, ఆగస్ట్ లో రిపోర్టు అందజేశారు.

**నాన్ రెవెన్యూ అధికారులకు అన్యాయం**

ఉదాహరణకు 100 ఐఏఎస్ పోస్టులు ఉంటే ఇందులో 66 శాతం యూపీఎస్సీ కింద డెరెక్ట్ రిక్రూట్ మెంట్ ద్వారా భర్తీ చేస్తున్నారు. మిగతా 34 శాతం సీనియర్ గ్రూప్ 1 ఆఫీసర్లకు కన్ ఫర్డ్ ఐఏఎస్ లుగా రాష్ట్ర ప్రభుత్వం పంపిన వారికి ఇంటర్వ్యూ చేపట్టి యూపీఎస్సీ ఎంపిక చేస్తున్నది. ఇందులో కూడా రెవెన్యూ అధికారులకే ఎక్కువ పోస్టులు దక్కుతున్నాయి. ప్రతిభావంతులైన నాన్ రెవెన్యూ గ్రూప్ 1 ఆఫీసర్లకు అన్యాయం జరుగుతున్నదనే వాదన కొన్నేండ్లుగా ఉన్నది.

**రిపోర్ట్ను ప్రభుత్వానికి ఇవ్వాలి**


టాస్ ఏర్పాటుపై మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ చైర్మన్ గా ఏర్పాటైన ఐఏఎస్ అధికారుల కమిటీ.. తమ రిపోర్ట్ ను ప్రభుత్వానికి అందజేయాలి.

# తెలంగాణలో మళ్లీ ఎమర్జెన్సీ రోజులు : కేటీఆర్

శనివారం ఆయన ట్వీట్చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాన్ని నిర్మిస్తున్నదని పేర్కొన్నారు. ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాడుతామని చెప్పారు. హెచ్ఎండీఏ పరిధిలోని గ్రామపంచాయతీ (జీపీ) లే అవుట్లలో ఉన్న వెంచర్లకు రిజిస్ట్రేషన్లను బంద్ పెట్టడం మూర్ఖపు చర్య అని కేటీఆర్ అన్నారు. పరిపాలనా అనుభవ లేమితో రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాల వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. మొన్నటిదాకా హైడ్రా, మూసీ పేరుతో పేదల గూడును కూల్చేసిన రేవంత్ సర్కారు.. ఇప్పుడు హెచ్ఎండీఏ పరిధిలోని పేదలను ప్రజలను టార్గెట్చేసిందన్నారు. వారి ప్లాట్లపైనా ఆర్ఆర్ ట్యాక్స్ను వసూలు చేసేందుకు సిద్ధమవుతున్నదని ఆరోపించారు. ఎన్నికల ముందు ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఎన్నో ఏండ్లుగా ఆ ప్లాట్లు ఎంతో మంది చేతులు మారాయని, ఇప్పుడు ప్రభుత్వం వచ్చి ఆ రిజిస్ట్రేషన్లు చెల్లవు.. మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

# గుడ్న్యూస్.. మొదట స్థలాలు ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో స్పెషల్గా అధికారులను ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ను మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేది ఇందిరమ్మ ఇళ్లేనని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పేదిరకమే ప్రామాణికమని తెలిపారు. ఇంటి యజమానురాలి పేరుపైనే ఇల్లు మంజూరు చేసి, బిల్లులను చెల్లిస్తామన్నారు. ఉచితంగా ఇసుక సరఫరా చేసేందుకు ఆలోచన చేస్తున్నామన్నారు. సిమెంటు, స్టీల్ తదితరాలకు డిస్కౌంట్ విషయమై ప్రభుత్వం యోచిస్తోందన్నారు. మొదటి దశలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది.




# ఎగిరిపోదాం విదేశాలకు..

(మొదటిపేజీ తరువాయి)

చదువుల కోసం వెళ్లగా, వీరు ఖర్చు చేసిన మొత్తం 80 బిలియన్ డాలర్లు.

**వీసాలు.. అవకాశాలకు ముఖ ద్వారాలు**

వీసాలు కేవలం ప్రయాణానికి నిర్దేశించిన ప్రామాణిక పత్రాలు కాదు.. అవి అవకాశాలకు ముఖద్వారాలు. పెద్దగా చదువుకోని వారు, నిరక్షరాస్యులు ఉపాధి కోసం గల్ఫ్ బాట పడుతున్నారు. యూఏఈ, ఖతార్, సౌది అరేబియా, కువైట్, ఒమన్, దుబాయ్లకు నిత్యం వేలాది మంది కార్మికులు, శ్రామికులు ఉపాధి కోసం వెళ్తున్నారు. ఇప్పటికే ఆయా దేశల్లో సుమారు 1.3 కోట్ల మంది భారతీయులు పనిచేస్తున్నారు. అలాగే విదేశాల్లో ఉండే మన దేశ రాయబారులు సైతం తమ పిల్లలను అక్కడే చదివించడానికి ఇష్టపడుతున్నారు. ఉద్యోగ నిర్వహణలో భాగంగా వారు భారత్కు తిరిగి రావాల్సి ఉన్నా, తమ పిల్లలను మాత్రం అక్కడే ఉంచేస్తున్నారు.

**రికార్డు స్థాయిలో అమెరికా వీసాలు**

వీసా వచ్చిందంటే మాకు హక్కు వచ్చినట్టేనని ఇక్కడి వారు భావిస్తున్నారు. అమెరికాలో అధ్యక్ష ఎన్నికల కారణంగా వీసా ప్రక్రియను తాత్కాలికంగా ఆపివేయడంతో ఎన్నికలు ఎప్పుడవుతాయా అని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. అమెరికా 2023లో రికార్డు స్థాయిలో ఎన్నడూ లేనంతగా 1,40,000 విద్యార్థి వీసాలు మంజూరు చేసింది. వీటికి 3,80,000 ఉద్యోగ వీసాలు అదనం. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది జూన్ వరకు ఎక్కువ సంఖ్యలో విద్యార్థి వీసాలు జారీ అయ్యాయి. ధనిక, శ్రేయస్సు దేశంగా పేరొందిన అమెరికా, యూకేలపై అన్ని వర్గాల వారు పరుగులు తీస్తున్నారు. సెప్టెంబర్లో యూఎస్ యూనివర్సిటీలకు పెద్దయెత్తున భారతీయ విద్యార్థులు తరలివెళ్లారు.


**భారత దేశ పౌరసత్వానికి గుడ్బై**

క్రమంగా మన దేశ పౌరసత్వాన్ని వదులుకుని విదేశాలకు వెళ్తున్న వారి సంఖ్య పెరుగుతున్నది. 2022లో 2,25,620 మంది తమ పౌరసత్వాన్ని త్యజించగా, 2023లో ఈ సంఖ్య కొద్దిగా తగ్గి 2,16,219గా నమోదైంది. అదే సమయంలో 1,000 మంది శరణార్థులకు మన దేశ పౌరసత్వం లభించింది. వీరిలో చాలామంది పాకిస్థాన్కు చెందిన వారే. అలాగే ఎలాంటి పన్నుల జంజాటం లేని యూఏఈ లకు వెళ్లే ఉద్యోగులు, నిపుణుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. ఇక వీరే కాకుండా మన దేశ రాజకీయ భావజాలం నచ్చని వారు, వేర్పాటువాదాన్ని ప్రోత్సహించే ఖలిస్థాన్ అనుకూలురు వంటి వారు కూడా కెనడా, యూకే లాంటి దేశాలకు వెళ్లి అక్కడి నుంచే నేరుగా తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇలా ఉండగా, అధికారికంగా తమ దేశాలకు వచ్చే విదేశీయుల కన్నా అనధికారికంగా వచ్చే శరణార్థులు, వలసవాదుల సంఖ్యే కొన్ని అగ్రదేశాల్లో ఎక్కువగా ఉంది. ఈ క్రమంలోనే ఇటీవల అమెరికా అక్కడ అనధికారికంగా, వీసా గడువు ముగిసినా అక్కడే ఉన్న కొందరు భారతీయులను ప్రత్యేక విమానాల్లో మన దేశానికి పంపేసింది.

**భారత్కు నష్టమా?**

మన దేశం నుంచి విదేశాలకు వెళ్తున్న వారి కారణంగా దేశ వార్షిక జీడీపీ 0.5 శాతం తగ్గుతున్నట్టు అంచనా. మన దేశంలో నిపుణులు, మేధావులకు కొరత లేదని.. ప్రతి ఏడాది లక్షల మంది విదేశాలకు వెళ్తున్నా.. అంతకు నాలుగైదు రెట్ల మంది నిపుణులు తయారవుతున్నారని, పైగా విదేశాలకు వెళ్లిన వారి ద్వారా మనకు విదేశీ మారకద్రవ్యం పెద్దయెత్తున వస్తున్నట్టు కొందరు మేధావులు చెబుతున్నారు. అయితే ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ ఇలా నిపుణులు, మేధావులను కోల్పోవడం మంచిది కాదని మరికొందరు సూచిస్తున్నారు.

# కేసీఆర్ కలల ప్లాంట్ రెడీ..



(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించనున్నారు. ఈ నెలాఖరు నుంచి ప్లాంట్ ద్వారా తెలంగాణకు 1600 మెగావాట్ల విద్యుత్ సరఫరా కానుంది.

**కేసీఆర్ దార్శనికతకు నిదర్శనం**

సమైక్య రాష్ట్రంలో తెలంగాణ కరెంట్ కష్టాలతో విలవిల్లాడింది. మరోవైపు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం గా ఏర్పడితే చీకట్లు తప్పవని నాటి పాలకులు భయపెట్టారు. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ విద్యుత్ కష్టాలు తొలగించడంలో భాగంగా కేసీఆర్ పలు విప్లవాత్మక చర్యలు చేపట్టారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా 2015 జూన్ 8న యాదాద్రి పవర్ ప్లాంట్కు కేసీఆర్ భూమిపూజ నిర్వహించారు. రూ.30వేల కోట్లతో 4000 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నిర్మాణ బాధ్యతలను బీహెచ్ఈఎల్కు అప్పగించారు. 5 ప్లాంట్ల పనులు అక్టోబర్ 2017లో ప్రారంభమయ్యాయి. 5,668 ఎకరాల భూమి సేకరించగా, 4,676 ఎకరాలు అటవీ భూమి ఉంది. ఇందులో 702.29 ఎకరాల్లో ఎంక్రోచర్స్ సాగు చేసుకునేవారు. వారికి కేసీఆర్ ఎకరానికి రూ.6 లక్షలు పరిహారం అందించారు. ఇలా ఒక్కో ఆటంకాన్ని అధిగమిస్తూ పనులు సాఫీగా సాగేలా చూశారు.

**నీరు, బొగ్గు కోసం చర్యలు**

విద్యుత్ ఉత్పత్తికి కావాల్సిన నీటిని కృష్ణా నది నుంచి తీసుకునేలా అనుమతులు పొందారు. నది నుంచి పైపులైన్ ఏర్పాటు చేశారు. బొగ్గు రవాణా కోసం సమీపంలో జాన్పహాడ్ రైల్వే క్రాసింగ్ నుంచి ప్లాంట్ వరకు రైల్వే లైన్ నిర్మించారు. రూ.100 కోట్ల వ్యయంతో 8కి.మీ రైల్వేలైన్ పనులు పూర్తయ్యాయి.

**సవాళ్లను దాటుకుంటూ**

కరోనా సమయంలో 10వేల మంది కార్మికులు తమతమ రాష్ట్రాలకు వెళ్లిపోవడంతో ప్లాంట్ పనులు రెండేండ్లు నిలిచిపోయాయి. ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, పనుల్ని తిరిగి పట్టాలెక్కించింది. కేసీఆర్ హయాంలోనే పనులు పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. కానీ కొందరు నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్లో కేసు వేయడంతో ఉత్పత్తికి అడ్డంకి ఏర్పడింది. అడ్డంకులు తొలగిపోవడంతో ఇప్పుడు ఉత్పత్తికి మార్గం సుగమమైంది.

# ఇంటింటి సర్వేకు సన్నాహాలు...

కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు అడిషనల్ కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తుండగా సీపీవో, ఆర్డీవో లతో కలిపి కోర్ కమిటీ ఏర్పాటు చేశారు.

జిల్లాలో 21 మండలాల్లో మొత్తం 491 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 1.68 లక్షల కుటుంబాలు ఉన్నాయి. సర్వే నిర్వహణ కోసం 150 కుటుంబాలకు ఒకరి చొప్పున 1,600 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. సర్వే తీరును పర్యవేక్షించేందుకు 10 మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్ వైజర్ ను నియమించారు.

ఈ నెల 6 నుంచి ఇంటింటి సర్వే మొదలు కానుండగా ఎన్యుమరేటర్, సూపర్వైజర్లకు ట్రైనింగ్ ఇచ్చారు. గ్రామాలు, మున్సిపాలిటీలో ఉన్న రిజిస్టర్ల ఆధారంగా ఇళ్ల జాబితాలు రూపొందించి వాటి ఆధారంగా సర్వేలో కుటుంబాల వివరాలు సేకరిస్తారు. ఒకే ఇంట్లో రెండు కుటుంబాలు నివసిస్తూ వేర్వేరుగా వంట చేసుకుంటున్నట్టయితే ఆయా కుటుంబాల వివరాలు వేర్వేరుగా నమోదు చేస్తారు.

**కలెక్టర్ స్పెషల్ ఫోకస్**

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల సర్వే) పై కలెక్టర్ రాహుల్ రాజ్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. కలెక్టరేట్ నుంచి సంబంధిత ఆర్డీవోలు, తహసీల్దార్, ఎంపీడీవోలకు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సర్వే నిర్వహణపై ఆదేశాలు జారీ చేశారు.

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఎన్యుమరేషన్ బ్లాకులు, సూపర్వైజర్స్ సరిపడినంత మందిని నియమించుకోవాలని, 10 శాతం రిజర్వ్ స్టాఫ్ అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. మున్సిపాలిటీలలో, గ్రామాల్లో ఏ ఒక్క ఇంటిని విడిచి పెట్టకుండా అన్ని కుటుంబాల సర్వే చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో జరుగుతున్న హౌస్ లిస్టింగ్ ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించారు.

**సిద్దిపేట జిల్లాలో..**

సిద్దిపేట జిల్లాలో 26 మండలాలు 399 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 2.38 లక్షలు కుటుంబాలు ఉన్నాయి. సమగ్ర కుటుంబ సర్వే కోసం ప్రతి మండలానికి ఒక జిల్లా అధికారిని నోడల్ ఆఫీసర్ గా నియమిస్తున్నారు. 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్ ను నియమించి నిర్దిష్టమైన బ్లాక్ మ్యాపులను అప్డేట్చేసి ఎన్యుమరేషన్బ్లాక్ లను కేటాయిస్తున్నారు.

బ్లాక్ ల పర్యవేక్షణకు సూపర్వైజర్లను



నియమిస్తున్నారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల శిక్షణకు నియోజకవర్గానికి ఒక మాస్టర్ ట్రైనర్ ను కేటాయించారు. వీరు ఇటీవల సర్వేపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తో అధికారులకు అవగాహన కల్పించారు.

**సంగారెడ్డి జిల్లాలో..**

జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ప్రతి కుటుంబానికి సంబంధించి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణ చేపట్టనున్నారు. కలెక్టర్ క్రాంతి ఇప్పటికే గ్రామాల్లో ట్రాయల్స్ మొదలుపెట్టారు. ఐదు రోజుల కింద సర్వే విషయమై మంత్రి దామోదర రాజనర్సింహ జిల్లా అధికారులతో రివ్యూ నిర్వహించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లక్ష్యాలు, విధివిధానాలు, కార్యాచరణ గురించి వివరిస్తూ, సర్వే విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు.

ఇందులో అందరిని భాగస్వాములు చేస్తూ సర్వేను సమగ్రంగా జరిపించాలని సూచించారు. సర్వే కోసం బ్లాక్ ల వారీగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లను నియమించారు. 2011 జనాభా గణన అనుసారంగా ఎన్యుమరేషన్ బ్లాక్ లను ఏర్పాటు చేసుకోవడం, కొత్తగా ఏర్పడిన కాలనీలను బ్లాక్ ల వారీగా అప్ డేట్ చేసుకునే పనిలో అధికారులు బిజీగా ఉన్నారు. జిల్లాలో ఉన్న 26 మండలాలకు గాను ప్రతి మండలానికి ఒక నోడల్ ఆఫీసర్ గా జిల్లాస్థాయి అధికారిని నియమించనున్నారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు మాస్టర్ ట్రైనర్లచే శిక్షణ ఇప్పిస్తున్నారు.

# స్మశానవాటిక సుందరికరణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి: 124 ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శంశిగుడా స్మశానవాటికలో సుమారు రూ.1కోటి నిధులతో జరుగుతున్న సుందరికరణ పనులలో భాగంగా నిర్మిస్తున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ శ్రీ దొడ్ల వెంకటేష్ గౌడ్ జీహెచ్ఎంసి అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ శంశిగుడా స్మశానవాటికలో ఇప్పటికే ప్రహరీ గోడ నిర్మాణం పూర్తయిందన్నారు. స్మశాన వాటికలో మొక్కలను పెంచి ఉద్యానవనం ఏర్పాటు చేసి అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. అంతిమయాత్రలో కూడా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా స్మశానవాటికకు కావలిసిన అన్ని మౌలిక వసతులు చేకూర్చుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, ఏఈ రాజీవ్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హోంగార్డు ఆఫీసర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

* **ఎస్పీ రోహిత్ రాజు**
* **జిల్లా ఎస్పీ రోహిత్ రాజు కి తమ సమస్యల పరిష్కారానికై వినతిపత్రం అందజేసిన జిల్లా హోంగార్డ్స్ ఆఫీసర్స్ అసోసియేషన్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: నిత్యం ప్రజలకు సేవలు అందిస్తూ,శాంతిభద్రతల పరిరక్షణ కోసం పాటుపడే పోలీసులకు సహాయకారులుగా పనిచేసే హోంగార్డు ఆఫీసర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని హోంగార్డ్స్ సమస్యలను అసోసియేషన్ తరపున వినతిపత్రం రూపంలో ఎస్పీ కి అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డు ఆఫీసర్స్ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.జిల్లాలోని ఆస్పత్రుల్లో,విద్యా సంస్థల్లో ఫీజుల రాయితీ గురించి యాజమాన్యాలతో చర్చిస్తామని తెలియజేసారు.జిల్లాలో పనిచేసే హోంగార్డ్ ఆఫీసర్స్ అందరూ క్రమశిక్షణతో,సమయపాలన పాటిస్తూ తమ తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు.ఉద్యోగ పరంగా మరియు వ్యక్తిగత పరంగా ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ఎస్పీ ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ,హోంగార్డ్స్ ఆర్ఐ నరసింహారావు,ఎంటిఓ సుధాకర్, హోంగార్డ్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాలోన్నారు.

# చర్లపల్లి డివిజన్ ను ఆదర్శ డివిజన్ గా అభివృద్ధి చేస్తా

* **ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : చర్లపల్లి డివిజన్ కు అవసరమైన నిధులను వెచ్చించి ఆదర్శ డివిజన్ గా అభివృద్ధి పరుస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఏఎస్ రావు నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ ప్రతినిధులు ఎంపల్లి పద్మా రెడ్డి, నేమూరీ మహేష్ గౌడ్,సారా అనిల్ ముదిరాజ్, గంప కృష్ణ, సారా వినోద్ ముదిరాజ్, తదితరులు చర్లపల్లి డివిజన్ అభివృద్ధి విషయమై శనివారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ని కలుసుకొని అభ్యర్థించారు. కుషాయిగూడ పోచమ్మ గుడి డిమార్ట్ శివ సాయి నగర్ వాసవి శివ నగర్ ప్రధాన రహదారిలో బాక్స్ డ్రైన్, రోడ్డు నిర్మాణం, చర్లపల్లి స్మశాన వాటిక అభివృద్ధి విషయమై అదేవిధంగా విస్టా ఓమ్స్ లో జంపింగ్ ద్వారా తప్పుగా వచ్చిన లక్షల రూపాయల నీటి బిల్లుల సమస్య విషయమై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. పై విషయాలపై సానుకూలంగా స్పందించిన ఆయన మాట్లాడుతూ అన్ని విభాగాలను సమన్వయం చేసుకొని చర్లపల్లి డివిజన్ ను ఆదర్శ డివిజన్ గా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

# కుల గణనతో రాజకీయాల్లో గొప్ప మార్పు

* **బీసీ కులగణన అవగాహన**
* **బీర్ల ఐలయ్య**



ఆలేరు, ప్రజాస్ఫూర్తి: కుల గణన సర్వే తో దేశ రాజకీయాల్లో గొప్ప మార్పు సంభవిస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో బీసీ కులగణన పై అవగాహన కార్యక్రమాన్ని డీసీసీ అధ్యక్షుడు అందెం సంజీవ రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిలుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ సమాజంలోని వివిధ కుల సమూహాల మధ్య సంపద, అధికార పంపిణీలో అసమానతలు, అసమతుల్యతలను బహిర్గతం చేయడంలో కుల జన గణన ప్రాముఖ్యత ఉందన్నారు. బీసీ, వివిధ కులాలకు చెందిన ప్రతి కుటుంబం సామాజిక స్థితి, ఆదాయ, సంపద, విద్య, ఉపాధి, గృహ నిర్మాణం, భూ యాజమాన్యం, రాజకీయ ప్రాతినిధ్యం వంటి వివిధ అంశాలను మదింపు చేయడం ఈ సమగ్ర సర్వే లక్ష్యమన్నారు. వివిధ కమ్యూనిటీల మధ్య అవకాశాల లభ్యతలో అసమానతలను ఖచ్చితంగా గుర్తించడం, సాక్ష్యాధారిత విధానం మరియు సంక్షేమ చర్యలకు పునాదిని సృష్టించడం దీని లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యాన్ని ప్రతి నాయకుడు, కార్యకర్త గ్రామ శాఖ అధ్యక్షులు, బిఎల్ఎ లు ప్రతి ఒక్కరు కష్టపడి గ్రామంలో ఈ కులగనునకు సహకరించాలని పిలుపునిచ్చారు. దేశ రాజకీయాలను మార్చబోయే గొప్ప కార్యక్రమం ఈ కుల గణన సర్వే అని అన్నారు అలాంటి సర్వే మన రాష్ట్రం నుండి కాంగ్రెస్ పార్టీ ప్రారంభించి దేశానికి దిక్సూచిగా నిలవాలని లక్ష్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ డిఎన్యేలోని సామాజిక న్యాయం ఉందని రోగికి ఎక్స్రే చేస్తే ఏ చికిత్స చేయవచ్చును తెలుస్తుందని అలాగే సమాజానికి ఈ కుటుంబ కుల గణన సర్వే చేస్తే భారత రాజ్యాంగం అందజేసి ప్రతి ఒక్క హక్కు ప్రతి ఒక్కరికి చేరుతుందన్నారు. ఈ సర్వేలో 85,000మంది ఎన్యూమరేటర్లు పాల్గొంటారని, వీరు సుమారు కోటి ఇళ్లకు వెళ్లి ప్రతి వ్యక్తి గురించి వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తారన్నారు. ప్రతి ఎన్యూమరేటర్ కు 150గృహాలకు ఒక సెన్సస్ ఎన్యూమరేషన్ బ్లాక్ కేటాయించారని, నవంబర్ మొదటి వారంలో ఇంటింటి సర్వేను ప్రారంభించేందుకు ఎన్యుమరేటర్లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చి క్షేత్రస్థాయిలో నియమించనున్నారన్నారు.

# ధరణి మాడ్యూల్స్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి

## అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి కలెక్టర్ హనుమంతరావు



యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి: ధరణి మాడ్యూల్స్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ధరణి, మీసేవ, షాదిముబారక్, కల్యాణలక్ష్మి, ఓటరు నమోదు పై శనివారం రివ్యూ నిర్వహించారు. జిల్లా రెవిన్యూ డివిజనల్ అధికారులు, మండల తహసీల్దార్ లకు మార్గ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ రెవిన్యూ యాంత్రాగం జరగకుండా ,ప్రధాన భూమిక పోషించాలన్నారు. ధరణి మాడుల్స్ లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి క్లియర్ చేయాలన్నారు. అన్ని మాడ్యుల్స్ లో దాఖలైన ధరణి దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపాలని మండల తహసీల్దార్లను ఆదేశించారు. ధరణి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయని, వాటిలో ఎన్ని పరిష్కరించారు, ఇంకా ఎన్ని పెండింగ్ ఉన్నాయని ఆరా తీశారు. పెండింగ్ ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను అవసరమైన రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, డేటా కరెక్షన్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన తర్వాతే పరిష్కరించాలన్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటర్ నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన ఆరుగురు విద్యార్థులు

* **కే ధనంజనేయులు**



నల్గొండ, ప్రజాస్ఫూర్తి: నల్గొండ జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశానుసారము ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి (సూర్యాపేట, యాదాద్రి భువనగిరి,నల్లగొండ) హాకీ 17 సవంత్సరాల బాలుర జిల్లా జట్టు ఏంపికలు మేకల అభినవ్ అవుట్డోర్ స్టేడియం యందు నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులోని ఖేలో ఇండియా సెంటర్ లో ఆర్.మురళి హాకీ కోచ్ ఉతమ శిక్షణ నిర్వహణలో బాగంగా జి. సందీప్, బి. సాయి గణేష్, ఏన్, సాయి గణేష్, జి. దుర్గా ప్రసాద్, ఆర్. మణి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 హాకీ స్టేట్ టోర్నమెంట్ కు గాను స్కూల్ గేమ్ లకు ఏంపికయ్యారు. జిల్లా యువజన, క్రీడల అధికారి కే.ధనంజనేయులు మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 హాకీ స్టేట్ టోర్నమెంట్ కు గాను స్కూల్ గేమ్ లకు ఏంపిక కా బడిన విధ్యార్థుల కు ఈ నెల 5, 6, 7తేదీలలో సంగారెడ్డి లోని అంబేద్కర్ స్టేడియం లో క్రీడలు నిర్వహించ బడుతాయని తెలిపారు. విద్యార్థులను ఉదేశిస్తూ ఇంకా ఉన్నత శికరాలకు అందుకోవాలని, రాష్ట్ర స్థాయిలో గెలుపొందాలని ఆకాంక్షించిన్నారు. అదేవిదంగా ఖేలో ఇండియా సెంటర్ ఆర్. మురళి హాకీ కోచ్ విద్యార్దులకు గేమ్ లో మంచి మెలుకువలు, మంచి శిక్షణ ఇవ్వాలని తెలిపినారు. మన యాదాద్రి భువనగిరి జిల్లా నందు ఆలేరు లోని ఖేలో ఇండియా నందు శిక్షణా పొందుతున్న క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి లో పాల్గొనాలని, మెడల్స్ పొందాలని తగు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమములో కార్యాలయ సిబ్బంది మురళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నవంబర్ 4న హెడ్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయండి

* **సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (ఎస్ సి కె ఎస్) పిలుపు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులుగా బెల్ట్ క్లీనింగ్ లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు స్కిల్డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో ఈనెల నాలుగవ తేదీన సింగరేణి హెడ్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కే బ్రహ్మచారి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రుద్రంపూర్ ఆర్ సి హెచ్ పి లో కాంట్రాక్టు కార్మికులను ఉద్దేశించి బ్రహ్మచారి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ఈ రాష్ట్రంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికులుగా బెల్ట్ క్లీనింగ్ మీద పనిచేస్తున్న వారికి కనీస వేతనం అమలు చేయకుండా సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు . కోల్ ఇండియాలో నిర్ణయించిన వేతనాలు అమలు చేయకుండా సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల పట్ల వివక్షతను పాటిస్తూ వేతనాలు పెంచకుండా స్కిల్ వేతనాలు ఇవ్వకుండా అన్ స్కిల్ వేతనాలు ఇస్తూ వారి శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. సింగరేణి లాభాల బాటలో నడుస్తున్న నేటి సమయంలో సింగరేణి అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సింగరేణి పర్మినెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులు కూడా ఉన్నారనే విషయాన్ని సింగరేణి యాజమాన్యం, కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆయన అన్నారు . ఎన్నికల ముందు ఓట్ల కోసం ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం గెలిచినాక కాంట్రాక్టు కార్మికులకు వేతనం ఎందుకు పెంచలేదో సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెరగాలంటే పోరాటాలు అనివార్యమని ప్రతి ఒక్కరు ఐక్యంగా ఉద్యమించి సింగరేణి కాంట్రాక్టు కార్మికులు ఒక తాటిపై నిలిచి కనీస వేతనాలు అమలు కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం బ్రాంచ్ సహాయ కార్యదర్శి భూక్య రమేష్, నాయకులు భాస్కర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు

# నిబంధనలు ఉల్లంఘించిన షాపులకు నోటీసులు

* **జిల్లా కలెక్టర్ ఆదేశాలనుసారం మెడికల్ షాప్ ల పైన దాడులు**
* **డ్రగ్ ఇన్స్పెక్టర్ అశ్విని కుమార్**



యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి: యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాలనుసారం జిల్లా డ్రగ్స్ ఇన్స్పెక్టర్ అశ్విన్ కుమార్ శనివారం భువనగిరి మండలం బోల్లేపల్లి గ్రామంలోని పలు మెడికల్ షాపులను తనిఖీ చేశారు. దుకాణదారుల లైసెన్స్, కొనుగోలు, విక్రయ బిల్లులను పరిశీలించారు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940 చట్టం నిబంధనలకు అనుకూలంగా లేని మెడికల్ షాపులకు నోటీసులు జారీ చేశారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించినచో వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఆరోగ్య సేవలను మెరుగుపరచడమే లక్ష్యంగా పనిచేయాలి

**డాక్టర్ టి రంగనాథస్వామి**





మేడ్చల్, ప్రజాస్ఫూర్తి: ఆరోగ్య సేవల అందుబాటును మెరుగుపరచడం లక్ష్యంగా చేయాలని డాక్టర్ టి రంగనాథస్వామి సూచించారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. టి. రఘునాథస్వామి, జిల్లా వ్యాక్సినేషన్ అధికారి డా. ఎమ్. సరస్వతి ఆధ్వర్యంలో ప్రజావాణి హాల్, సమ్మిళిత జిల్లా కార్యాలయ సంక్షేత్రంలో రొటీన్ ఇమ్యూనైజేషన్ (ఆర్ఐ) పై రెండు రోజుల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ శిక్షణలో రాష్ట్రస్థాయి శిక్షకులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తి దవాఖాన మరియు పల్లె దవాఖాన వైద్య అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డా టి రఘునాథస్వామి గారు మాట్లాడుతూ వాక్సిన్ కవర్ను పెంచడం మరియు ఆరోగ్య సేవల అందుబాటును మెరుగుపరచడం లక్ష్యంగా శిక్షణను నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్య శాఖ ప్రాథమిక ఆరోగ్య సేవల్లో సమగ్రతను మరియు సామర్థ్యాన్ని పెంచడానికి కృషి చేస్తోందన్నారు.

# తెలంగాణ కుల గణన దేశానికి రోల్ మోడల్ కావాలి

* **కులగణనను ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేయండి :**
* **ప్రజాస్వామ్యం పరిడవిల్లేల కులగణన తో ప్రజా ప్రాతినిధ్య రిజర్వేషన్లు:**
* **ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి**





ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్: ఉదయపూర్ డిక్లరేషన్ తో దేశంలో ఎక్కడలేని విధంగా సామాజిక న్యాయం, బహుజనులకు రిజర్వేషన్లను తెలంగాణ రాష్ట్రంలో కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో నిర్వహిస్తున్న కుల గణనను ప్రతిష్టాత్మంగా తీసుకొని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ మహేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. పిసిసి అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన కుల గణన, సామాజిక ,ఆర్థిక ,విద్య, ఉపాధి రాజకీయ సమగ్ర ఇంటింటి కులగణన సర్వే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్థాయి సన్నాక కార్యక్రమ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, కూన శ్రీశైలం గౌడ్, సీనియర్ నాయకులు కొలను హనుమంత రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్ తదితరులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ తో పాటు అన్ని వర్గాల ప్రజలకు ప్రజాప్రతినిధ్యంలో ముఖ్యంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సమాన ప్రాతినిధ్యం కోసం ఈ సర్వే ఉపయోగపడుతుందని అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపునిచ్చారు. జెడ్పిటిసి చైర్ పర్సన్ మల్కాజ్గిరి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పట్నం సునీత మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, మైనంపల్లి హనుమంత రావు, కూన శ్రీశైలం గౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిలు కొలన్ హన్మంత్ రెడ్డి, జంగయ్య యాదవ్, పరమేశ్వర్ రెడ్డి, బండి రమేష్ తదితరులు మాట్లాడుతూ సీఎం చేపట్టిన కులగణన కార్యక్రమాన్ని మహా యజ్ఞంగా ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ జి. వి. వెన్నెల , డిసిసి అధ్యక్షులు కే. యమ్ ప్రతాప్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు జోష్ణ శివారెడ్డి, తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యురాలు భవాని, జిల్లా నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, డివిజన్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళ కాంగ్రెస్ నాయకులు, ఎస్సి మరియు ఎస్టీ సెల్ నాయకులు, మైనారిటీ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్ యూ ఐ నాయకులు, ఐఎన్టియూసి నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## గిరిజన మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్





ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం నెహ్రూ నగర్ లో గల గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గురుకుల వసతి గృహంలో సౌకర్యాలు సమస్యలను విద్యార్థినీలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. నిబంధనల ప్రకారం విద్యార్థులకు దించాల్సిన ఆహారం, విద్యా సామాగ్రి ఇతర సౌకర్యాల గురించి అక్కడ విద్యార్థులను అడిగి తెలుసుకుంటూ వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కళాశాల ప్రిన్సిపల్ అనురాధను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినిలకు కావలసిన మెరుగైన వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. రాబోయే న్యాక్ (ఎన్ ఏఏసి) అక్రిడేషన్ కోసం విద్యార్థులు ఉన్నత భవిష్యత్తు ప్రణాళికలు ఏ విధంగా నిర్మించుకోవాలి అని విద్యార్థులకు, సిబ్బందికు తగు సూచనలు చేశారు. విద్యార్థినులు ఏవైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన కొలను శ్రీనివాస్ రెడ్డి



నిజాంపేట్, ప్రజాస్ఫూర్తి: ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి శ్రీ అయాంజనేయ స్వామి ఆలయం, శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం, శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయాన్ని శనివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.


## మార్కెట్ యార్డులో తడిసిన మొక్కజొన్న



కొల్లాపూర్, నవంబరు 2 : కొల్లాపూర్ మండల కేంద్రంలో శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి మార్కెట్ యార్డులో రైతులు ఆరబెట్టిన మొక్క జొన్న తడిసింది. కొల్లాపూర్ పట్టణంలో వర్షం లేకున్నా పట్టణ శివారులలో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డు లో వర్షం కురిసింది. దీంతో వారం రోజుల నుంచి రైతు లు ఆరబెట్టుకున్న మొక్కజొన్న వర్షం నీటిలో తడిసింది. వారం రోజులుగా మార్కెట్ యార్డులో పడిగాపులు కా స్తున్న ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు చేయకపోవడం తో రైతులు నష్టపోయారని, నష్టపోయిన రైతులకు మద్దతు ధర చెల్లించి మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రా వు డిమాండ్ చేశారు. అంతకుముందు తడిసిన మొక్క జొన్న పంటలను ఆయన పరిశీలించారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

* **రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**
* **ధాన్యం నిల్వ చేసేందుకు అవసరమైన ఇంటర్మీడియట్ గోడౌన్ లను గుర్తించాలి***
* **రైస్ మిల్లుల వద్ద తాలు పేరుతో ఎటువంటి కోతలు విధించడానికి వీలు లేదు**
* **ధాన్యం కొనుగోలు పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి***



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలలో నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం దాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హైదరాబాద్ లోని డా బి ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి ధాన్యం కొనుగోలు పై రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ఐడిఓసి కార్యాలయం నుండి కలెక్టర్ జితేష్ వి. పాటిల్, సిపిఓ సంజీవరావు, పౌర సరఫరాల అధికారి త్రినాధ్ బాబు , డిఎం నరేందర్, డీసీవో ఖుర్షిద్ , తదితరులు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోలు పై తీసుకోవాల్సిన చర్యల గురించి పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్.చౌహాన్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ చాలా ప్రతిష్టాత్మకమని, ఏ చిన్న సమస్య రాకుండా సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు జరిగేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అన్నారు. ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిందన్నారు. సన్నరకం ధాన్యం సాగు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాల్ రూ.500ల బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో రూపొందించుకున్న ప్రణాళికల ప్రకారం దాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన ప్యాడీ క్లీనర్, ఇతర సామాగ్రి వెంటనే యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని అన్నారు. దొడ్డు రకం, సన్న రకం ధాన్యాలను విడి విడిగా భద్రపరచాలన్నారు. తాలు పేరుతో కోతలు పెట్టొద్దని, కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యత ప్రమాణాలు పరిశీలించిన తర్వాత కొనుగోలు చేయాలని అన్నారు. రైతుకు ఎటువంటి నష్టం రావడానికి వీలు లేదని మంత్రి స్పష్టం చేశారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకుని రావాలని దాని వల్ల కొనుగోలు ప్రక్రియ సులభం అవుతుందని మంత్రి సూచించారు. జిల్లాలోని రైస్ మిల్లర్లకు ధాన్యం కేటాయింపు కోసం బ్యాంకు గ్యారంటీ తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, వీటిని కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. రైస్ మిల్లర్లతో సమావేశాలు నిర్వహించాలని, జీఓపై చర్చించాలని అవగాహన, రైస్ మిల్లర్లచే బ్యాంక్ గ్యారంటీ సమర్పిస్తామని అండర్ టేకింగ్ తీసుకుని ధాన్యం కేటాయింపు చేయవచ్చన్నారు. రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ సమర్పించని పక్షంలో జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం భద్ర పరిచేందుకు అవసరమైన మేర ఇంటర్మీడియట్ గోడౌన్లు సన్నద్ధం చేయాలని తెలిపారు. ప్రతి జిల్లాలో ధాన్యం కొనుగోలు ఫోన్ నెంబర్ తో కూడిన గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 48గంటల్లో చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలని అన్నారు. పక్క రాష్ట్రాల ధాన్యం మన కొనుగోలు కేంద్రాలకు రాకుండా సరిహద్దు వద్ద పటిష్ఠ చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ* జిల్లాలో ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.వరి ధాన్యం అమ్మిన రైతుల బ్యాంకు ఖాతాలలో రెండు రోజుల్లో డబ్బులు జమ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.రైతులు ధాన్యం అమ్మిన డబ్బులు వారి ఖాతాలో రెండు రోజుల్లో జమ అయ్యేందుకు పట్టాదారు పాస్ పుస్తకం ,ఆధార్ కార్డుకార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాఫీలు కొనుగోలు కేంద్రాల్లోనే అందజేస్తే రెండు రోజుల్లోనే వారి అకౌంట్లో నిధులు జమ చేస్తామని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ధాన్యానికి ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

* **ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కి ఆహ్వాన పత్రిక అందజేసిన కార్పొరేటర్ మునగాల సతీష్**



ప్రజాస్ఫూర్తి, జవహర్ నగర్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ మునిసిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ లోని ఆర్యవైశ్య సంగం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా విచ్చేయాలని స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకురా మల్లా రెడ్డికి స్థానిక కార్పొరేటర్ మునగల సతీష్ కుమార్ శనివారం ఆహ్వాన పత్రికను అందజేశారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమనికి విచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కరుణా కటాక్షాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంగం అధ్యక్షుడు రవీందర్ గుప్త, ప్రధాన గౌరవ అధ్యక్షులు గౌరీశెట్టి బాద్రెష్ గుప్త, సహా కోశాధికారి చంద్ర శేఖర్ గుప్త, కమిటీ సభ్యులందరూ పాల్గొన్నారు.

## టిటిడి బోర్డు మెంబర్ నన్నూరి నర్సిరెడ్డి కి సన్మానం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్ గా ఎన్నికైన సందర్భంగా నన్నూరి నర్సిరెడ్డిని టి ఎన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర నాయకుడు శివనంద్, టి జి కె మూర్తిలు శనివారం కలిశారు. బోర్డు మెంబర్ గా ఎన్నిక కావడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో ఘనంగా సత్కరించారు.

## విజ్ఞానోత్సవ్ పార్టిసిఫికేషన్ సర్టిఫికెట్లను అందజేత

* **జెరిపోతుల ప్రభుదాస్**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని తిరుమలనగర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులకు యుడబ్ల్యూహెచ్ మరియు ఆకృతి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన విజ్ఞానోత్సవ్ పార్టిసిఫికేషన్ సర్టిఫికెట్లను కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సిస్టం సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితంలో విద్యార్థులకు జ్ఞానాన్ని మెరుగుపరచాలని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో క్విజ్ డిబెట్, ఉపన్యాసము, వ్యాసరచన, విజ్ఞాన్ ఉత్సవ్ పేరిట యుడబ్ల్యూహెచ్ యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో ఆకృతి ప్రాజెక్ట్ లో భాగంగా ఎక్స్పోజర్ విజిట్ అనే ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు సెంట్రల్ యూనివర్సిటీ హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కాంపిటీషన్ లో ఎంపీహెచ్ఎస్ తిరుమల నగర్ స్కూల్ 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. ప్రోత్సహిస్తున్న సంస్థలకు పాఠశాల ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా మద్యం విక్రయించొద్దు



కేశంపేట నవంబరు 2 : గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కేశంపేట సీఐ నరహరి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంతోపాటు వేముల్నర్వ, కొత్తపేటలో స్పెషల్‌డ్రైవ్ చేపట్టారు. సీఐ మాట్లాడుతూ వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. గ్రామాలలోని కిరాణా షాపులలో మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హోటల్, కిరాణా షాపులలో సోదాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

